https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు



సోషల్ మీడియా సైకోలను ఎవ్వరినీ వదలం: అనిత

4

# ప్రతి ఎకరాకూ నీరు



- నదుల అనుసంధానమే సముచిత మార్గం
- వృధా నీటిని ఒడిసిపట్టే అవకాశం
- గోదావరి- కృష్ణా-పెన్నా అనుసంధానంపై చర్చ
- సమస్యలు, సవాళ్లను అధిగమించి ముందుకెళ్దాం
- సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం
- జలవనరుల శాఖపై సీఎం ఛాంబర్‌లో సమీక్ష

రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అందుకు అవసరమైతే కొత్త సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి అయినా లక్ష్యం నెరవేర్చాలి. అంతకంటేముందు.. వృధాగా సముద్రంలోకి పోతోన్న వరద నీటిని నదుల అనుసంధానంతో ఒడిసిపట్టగలిగితే ప్రతి ఎకరాకూ నీరివ్వొచ్చు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పట్టిసీమ ద్వారా గోదావరి- కృష్ణా నదుల అనుసంధానం పూర్తిచేసి లక్షల ఎకరాల సాగునీటి అవసరాలు తీర్చగలిగాం. ఇప్పుడు దానికి కొనసాగింపుగా... నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. గోదావరి- కృష్ణ-పెన్నా నదుల అనుసంధానంపై దృష్టి పెట్టడం అందులో భాగమే. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువెళ్లేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇప్పుడు ఆ ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. మూడు నదుల అనుసంధానంతో పాటు... పోలవరం కాలువ సామర్థ్యం పెంపుపై అధికారులు మరింత కసరత్తు చేయాలి. ఆర్థికంగా ప్రభుత్వానికి ఇది సవాలే. అయినా.. రైతాంగ అవసరాలను, రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేద్దాం.

– ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2లో

## పొలిటికల్ పెన్‌కౌంటర్



ముఖ్యమంత్రి మోసాలపై ట్వీట్ చేస్తానని, దమ్ముంటే అరెస్ట్ చేయాలని చీకట్లో చిడతలు వాయిస్తున్నాడు వైసీపీ నాయకుడు. ట్వీట్లెందుకు అసెంబ్లీకి వస్తే చర్చిద్దామని సర్కారే పిలుస్తుంటే మాత్రం.. నక్కే నత్తి నంగనాచి కబుర్లు చెప్తున్నాడు. అదీ జగన్ రాజకీయం!!

చీకటింట చిటికెలతో
వేలుతోంది జగన్ను..!
అసెంబ్లీకి ఆరుబయట
మాట్లాడితే.. తగను!!

నిన్ను చూసి రెచ్చినారు
పెయిడు బ్యాచు సైకోగాళ్లు..!
దిక్కులేని నిన్ను చూసి
వణుకుతుందె వాళ్ల కాళ్లు!

మాటతప్పి.. మడమతిప్పి
నీకెందుకు రాజకీయం....!
దౌర్జన్యం చేసేందుకు
కాదు ఇది.. ఫ్యాక్షనిజం!!

చేతగాని చేవలేని
తాడేపల్లి కుందేలు!
చంద్రన్నకు విసురుతోంది..
సరికొత్తగ సవాలు!!

- మహాదేవ

# రెండేళ్లలో ట్రైబల్ వర్సిటీ

- పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి
- అసెంబ్లీలో ఐటీ మంత్రి లోకేష్ సమాధానం



టీడీపీ హయాంలో 1.5 లక్షల టీచర్ పోస్టుల భర్తీ 4

గత ప్రభుత్వ హయాంలో ట్రైబల్ వర్సిటీ స్థలం మార్చి ఐదేళ్లు పనులు ముందుకు సాగకుండా జాప్యం చేశారు. రాజకీయంగా మాకు మంచిపేరు వస్తుందని స్థలాన్ని మార్చారు. ఇప్పుడు -2019లో నిర్ణయించిన స్థలంలోనే వచ్చే రెండేళ్లలో సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ పూర్తి చేస్తాం. 2014-19 మధ్య అప్పటి సీఎం చంద్రబాబు అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యతనిచ్చిన ప్రాతిపదికనే.. కేంద్రం కేటాయించిన విద్యాసంస్థలనూ వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఐఐటీ తిరుపతికి, ఐఐఎం విశాఖకి, ఎన్ఐటీ తాడేపల్లిగూడానికి, ట్రిపుల్ ఐటీ కర్నూలుకు, సెంట్రల్ వర్సిటీ అనంతపురానికి వచ్చాయి. అభివృద్ధి వికేంద్రీకరణ అంటే ఇదీ. రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడం కాదు. కేంద్ర విద్యాసంస్థలకు పెండింగ్‌లో ఉన్న రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తుంది.

- అసెంబ్లీలో ఐటీ మంత్రి నారా లోకేష్

2



4

## 'డిప్యూటీ'గా రఘురామే..

కూటమి మంత్రుల నేతృత్వంలో నామినేషన్ దాఖలు



7

## 'మెట్రో'కు మోక్షం..

కేంద్ర అనుమతి రాగానే ప్రాజెక్టు ముందుకు: నారాయణ





## చేనేత మార్కెటింగ్‌కు 'ఆద్యం'

బిర్లా గ్రూప్‌తో ఒప్పందంపై నేడు చర్చ 5



6

## వైసీపీకి చెలగాటం..

# బాధితులకు ప్రాణసంకటం

- టీడీపీ ఏజెంట్‌గా కూర్చున్నందుకు అక్రమ కేసులు
- మామిడి చెట్లు నరికించారంటూ బోరుమన్న బాధితుడు
- ఇవ్వాల్సిన డబ్బులు అడిగినందుకు వైసీపీ కార్యకర్త దాడి చేశారంటూ బాధితుడి గగ్గోలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పించమంటూ విద్యార్థుల అర్జీ
- తెదేపా కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్

# ప్రతి ఎకరాకూ నీరు

- నదుల అనుసంధానమే సముచిత మార్గం
- వృథా నీటిని ఒడిసిపట్టే అవకాశం
- గోదావరి- కృష్ణా- పెన్నా అనుసంధానంపై చర్చ
- సమస్యలు, సవాళ్లను అధిగమించి ముందుకెళ్దాం
- సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం
- జలవనరుల శాఖపై సీఎం ఛాంబర్‌లో సమీక్ష



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ సాగునీరిచ్చే లక్ష్యంతో రాష్ట్రంలో కొత్త సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని నదుల అనుసంధానంతో ఒడిసిపట్టి ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వొచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పట్టిసీమ ద్వారా గోదావరి- కృష్ణా నదుల అనుసంధానం పూర్తిచేసి లక్షల ఎకరాల సాగునీటి అవసరాలు తీర్చామన్నారు. ఇప్పుడు దానికి కొనసాగింపుగా... నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లే ఆలోచనలో ఉన్నట్టు సీఎం వెల్లడించారు. ఇందులో భాగంగానే గోదావరి- కృష్ణ- పెన్నా నదుల అనుసంధానంపై దృష్టిపెట్టినట్టు సీఎం వివరించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువెళ్లేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని.. ఇప్పుడు ఆ ప్రతిపాదనలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దీన్ని ముందుకు తీసుకువెళ్లడంలో భాగంగా సీఎం సూచనల మేరకు ఇరిగేషన్ అధికారులు గోదావరి-కృష్ణ- పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి ముందుంచారు. గోదావరి- కృష్ణ- పెన్నా నదుల అనుసంధాన ప్రతిపాదనలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. గోదావరి నీటిని పోలవరం నుంచి కృష్ణా నదికి, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు, అక్కడినుంచి బనకచర్లకు తరలించే ప్రాజెక్టు ప్రతిపాదనలపై చర్చించారు. రెండో ప్రతిపాదన కింద.. పోలవరం నుంచి కృష్ణానదికి, అక్కడి నుంచి బొల్లాపల్లికి, అక్కడి నుంచి సోమశిల ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్చించారు. ఎక్కువ మొత్తంలో గోదావరి నీటిని తీసుకునేందుకు పోలవరం కుడి కాలువ సామర్థ్యం పెంచడం కోసం విస్తరణ చేపట్టాలా? లేక కాలువకు సమాంతరంగా మరో కాలువ తవ్వాలా? అనే అంశంపైనా చర్చించారు. రెండు ప్రతిపాదనల్లో దేని ద్వారా అయితే సత్వర ఫలితాలు వస్తాయి.. దేనికి తక్కువ ఖర్చవుతుందనే అంశాలపైనా అధికారులు ప్రాథమిక వివరాలు అందించారు. మూడు నదుల అనుసంధానంతో పాటు... పోలవరం కాలువ సామర్థ్యం పెంపుపై మరింత కసరత్తు చేయాలని సీఎం సూచించారు. ఆర్థికంగా ఇదొక పెద్ద సవాల్ అయినా.. రైతాంగ అవసరాలను, రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టు చేపట్టాలనే ఆలోచనలో తాను ఉన్నట్టు సీఎం తెలిపారు.

అనంతరం.. పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ పనులపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పునరావాసం కోసం ఇంకా 18,925 ఇళ్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2022నుంచి పోలవరం పునరావాస కాలనీల్లో అన్ని నిర్మాణాలను కాంట్రాక్టర్లు నిలిపివేసినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులే రూ.155 కోట్లు వరకు ఉన్నాయని తెలిపారు. పాత రేట్లతో ఇప్పుడు పనులు చేయలేమని కాంట్రాక్టర్లు చెపుతున్నారని అధికారులు వివరించారు. దీనిపై చర్చించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. తిరిగి పోలవరం పనులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో... భూసేకరణ, పునరావాసం పనులు కూడా సమాంతరంగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. వీటికి తక్షణ అవసరాల కింద రూ.2,600 కోట్లు అవసరమని అధికారులు తెలపగా.. దీనిపై త్వరలో ఆదేశాలు ఇస్తానని సీఎం తెలిపారు. పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణం, ఈసీఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణంపై ప్రాజెక్టు వద్ద జరిగిన వర్క్‌షాప్‌లో వచ్చిన అభిప్రాయాలు, నిర్ణయాలను అధికారులు సీఎంకు వివరించారు. పోలవరం పనుల షెడ్యూల్‌పై పూర్తిస్థాయి స్పష్టత వచ్చిన తరువాత తాను పోలవరం ప్రాజెక్టును సందర్శించి... అక్కడే పనులపై షెడ్యూల్ ప్రకటిస్తానని ముఖ్యమంత్రి అధికారులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకురానున్న వాటర్ పాలసీపైనా సమీక్షలో చర్చ జరిగింది. మరికొంత కసరత్తు తర్వాత దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ సమీక్షలో జలవనరుల మంత్రి రామానాయుడు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆధ్వర్యంలో
# సత్యసాయి శతాబ్ది జన్మదిన వేడుకలు



- వచ్చే ఏడాది ఘనంగా నిర్వహిద్దామన్న చంద్రబాబు
- సత్యసాయి ట్రస్ట్ ఆహ్వాన కమిటీకి మాటిచ్చిన ముఖ్యమంత్రి
- నవంబరు 23న సత్యసాయి 99వ జన్మదిన వేడుకలు
- ప్రత్యేక ఆహ్వానితులుగా ముఖ్యమంత్రికి ఇన్విటేషన్
- మంత్రి లోకేష్‌నూ ఆహ్వానించిన సత్యసాయి కమిటీ

అమరావతి (చైతన్య రథం): పుట్టపర్తిలో నవంబర్ 23న జరిగే భగవాన్ శ్రీ సత్య సాయిబాబా జన్మదిన వేడుకలకు ప్రత్యేకంగా ప్రభుత్వం తరఫున హాజరుకావాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించారు. అమరావతిలోని ముఖ్యమంత్రి ప్రత్యేక ఛాంబర్‌లో బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తోపాటు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిలతో కలిసి ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈనెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని, వచ్చే 2025 నవంబర్ మాసంలో జరిగే సత్యసాయి శతాబ్ది జన్మదిన వేడుకలను ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర పండుగలా గుర్తించి నిర్వహిస్తామని, ఆ కార్యక్రమానికి పుట్టపర్తికి తప్పకుండా హాజరవుతానని సత్యసాయి ట్రస్ట్ సభ్యులు రత్నాకర్, మంత్రి సత్యకుమార్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకు ప్రభుత్వం తరఫున తగిన ఏర్పాట్లు చేసేలా జిల్లా యంత్రాంగంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని సత్యసాయి ట్రస్టు సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం మానవ వనరుల అభివృద్ధి మంత్రి నారా లోకేష్‌ను కలిసి సత్య సాయిబాబా జన్మదిన వేడుకలకు హాజరుకావాలని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఆర్జే రత్నాకర్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం పలికారు. తప్పకుండా ప్రభుత్వం తరఫున సత్యసాయి 100వ జన్మదిన వేడుకలు నిర్వహించేలా చూస్తానని మంత్రి లోకేష్ ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీకి హామీ ఇచ్చారు.

# రెండేళ్లలో ట్రైబల్ వర్సిటీ

- పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్



అమరావతి (చైతన్య రథం): గత ప్రభుత్వ హయాంలో ట్రైబల్ వర్సిటీ స్థలం మార్చి ఐదేళ్లు పనులు ముందుకు సాగకుండా జాప్యం చేశారు. రాజకీయంగా మాకు మంచిపేరు వస్తుందని స్థలాన్ని మార్చారు. 2019లో నిర్ణయించిన స్థలంలోనే వచ్చే రెండేళ్లలో సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ పూర్తి చేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. విభజనచట్టం ప్రకారం పెండింగ్‌లో ఉన్న విద్యాసంస్థలపై శాసనసభ్యులు బుచ్చయ్యచౌదరి, బోండా ఉమ అడిగిన ప్రశ్నలకు అసెంబ్లీలో మంత్రి లోకేష్ సమాధానమిచ్చారు. 2014-19 మధ్య చంద్రబాబునాయుడు అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యతనిచ్చారని, ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సెక్టార్ వైజ్ ఫోకస్‌పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని మంత్రి లోకేష్ వివరించారు. అనంతపురం జిల్లాకు కియా తెచ్చారు. చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, నెల్లూరు విండ్ టర్బయిన్, కర్నూలు రెన్యూవబుల్ ఎనర్జీ, సెల్‌ఫోన్, ఉభయగోదావరిలో ఆక్వా, ఉత్తరాంధ్ర ఐటీ, మెడికల్ డివైస్, ఫార్మా పరిశ్రమలను ప్రోత్సహించారు.

విభజన చట్టంలో రాష్ట్రానికి కేటాయించిన విద్యాసంస్థలను కూడా వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఐఐటీ తిరుపతికి, ఐఐఎం విశాఖకి, ఎన్ఐటీ తాడేపల్లిగూడానికి, ట్రిపుల్ ఐటీ కర్నూలుకు, సెంట్రల్ వర్సిటీ అనంతపురానికి కేటాయించారు. అభివృద్ధి వికేంద్రీకరణ అంటే ఇదీ. రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడం కాదు. ఐఐటీ తిరుపతికి ఆగస్టు 9, 2016లోనే భూములు కేటాయించి పనులు ప్రారంభించారు. ఎన్ఐటీ తాడేపల్లిగూడెంకు ఏప్రిల్ 16, 2016లో 172 ఎకరాలు, విశాఖలో ఐఐఎంకు ఏప్రిల్ 16, 2016లో 240 ఎకరాలు భూములు, సెంట్రల్ వర్సిటీ అనంతపురానికి ఏప్రిల్ 16, 2016లో 491 ఎకరాలు, ఐసర్‌కు 255 ఎకరాలు, ట్రిపుల్ ఐటిలకు కూడా భూములు అప్పట్లోనే కేటాయించారు. యుద్ధప్రాతిపదికన భూములు కేటాయించడమేగాక, కేంద్ర ప్రభుత్వంనుంచి వచ్చే నిధులు, పనుల పురోగతిని ఆనాడు ప్రతినెలా ముఖ్యమంత్రి సమీక్షించారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా విభజన చట్టంలో ఉన్న విద్యా సంస్థలను కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులను పూర్తిచేసేందుకు చిత్తశుద్ధితో కృషిచేశారు. ఆయా విద్యాసంస్థలకు పెండింగ్‌లో ఉన్న రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి లోకేష్ సమాధానమిచ్చారు.

చైతన్యరథం

ముప్పైయేళ్ల చంద్రన్న స్మార్ట్ అండ్ హార్డ్‌వర్క్

# అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయానికి పట్టం

సెప్టెంబరు 1, 1995న శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా తొలుత బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 1, 2024 నాటికి 30వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంలో.. మహోజ్వల విజయాలు కొన్ని.

## విజనరీ లీడర్ మన చంద్రన్న




## ఆపద్భాంధవుడు చంద్రన్న

1. 2013 ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగు యాత్రికుల్ని విమానాల్లో తరలించారు.
2. ఒడిశా, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ భూకంప, తుఫాన్ బాధితుల్ని ఆదుకున్నారు.
3. హుద్‌హుద్ సమయంలో 9 రోజులు అక్కడే బస్సులో చివరి బాధితుడి వరకు సాయం.
4. 2009 తుంగభద్ర వరదలకు కర్నూలులో ఒక్కరోజులోనే 30 వేల మందికి సాయం అందించారు.
5. ఎసెన్షియా మృతుల ఒక్కో కుటుంబానికి కోటి పరిహారం అందించారు.

.... ఇలా ఎన్నో.. ఎన్నెన్నో విపత్తుల్లో అపద్భాంధవుడుగా నిలిచారు.





చైతన్యరథం

# గురువులను గౌరవిస్తాం

- బెస్ట్ డీఎస్సీ నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల భర్తీ
- సమస్యలను సానూకూలంగా పరిష్కరిస్తాం
- టీడీపీ హయాంలో 1.5లక్షల పోస్టులు వేశాం
- శాసనసభలో మంత్రి లోకేష్ వెల్లడి

అమరావతి (చైతన్యరథం) : గురువులను గౌరవిస్తామని, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించి, విద్యాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. శాసన సభలో సభ్యుల ప్రశ్నలకు ఆయన సావధానంగా సమాధానం చెప్పారు. ప్రజాదర్బార్‌లో డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు తనను కలిసినపుడు వారితో చర్చించామన్నారు. 1998 డీఎస్సీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న 4,534 పోస్టుల్లో 3939 పోస్టులు భర్తీచేశారన్నారు. ఇంకా 595 పోస్టులు భర్తీచేయాల్సి ఉందన్నారు. ఇంకా ఎక్కువ ఉన్నాయని సభ్యులు చెబుతున్నారని పరిశీలించి న్యాయం చేస్తామని వెల్లడించారు. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు పోస్టింగ్స్ విషయమై బీజేపీ శాసనసభ్యుడు విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ ఎంటీఎస్ కింద నియమితులైన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం వారికి ఎటువంటి రిటైర్ మెంట్ బెనిఫిట్స్ ఉండవన్నారు. వారికి ఉద్యోగ విరమణ వయసు 60 సంవత్సరాలని సభ్యులు లేవనెత్తిన సమస్యపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతంలో టీడీపీ ఎప్పుడు అధికారంలో ఉన్నా విద్యను బాధ్యతగానే నిర్వహించిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు 11 డీఎస్సీలు నిర్వహించి 1.5లక్షల టీచర్ పోస్టులు భర్తీచేశాం, అందులో 9 డీఎస్సీలు చంద్రబాబు



హయాంలోనే నిర్వహించారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి తొలి సంతకం మెగా డిఎస్సీ ఫైలుపైనే పెట్టారని గుర్తు చేశారు. అభ్యర్థుల విన్నపాల మేర ముందుగా టెట్ నిర్వహించామని చెప్పారు. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం అయిదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీచేయలేదని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమికి ప్రజలు 93శాతం సీట్లు ఇచ్చిన నేపథ్యంలో నిరుద్యోగులంతా మనవైపు ఆశగా ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి తనను ఉపాధి కల్పన సబ్ కమిటీ చైర్మన్‌గా నియమించారని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళతామన్నారు. గతంలో డీఎస్సీపై పడిన కేసులను స్టడీ చేసి, లీగల్ లిటిగేషన్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరలో బెస్ట్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాదికి ఖాళీగా ఉన్న టీచర్

పోస్టులన్నీ భర్తీచేస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

# ఉప సభాపతిగా రఘురామ

**ఎన్డీఏ కూటమి మంత్రుల నేతృత్వంలో నామినేషన్ల దాఖలు ◆ నేటి మధ్యాహ్నం ఏకగ్రీవ ప్రకటనకు అవకాశం**



అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి పదవికి ఉండి శాసన సభ్యులు కనుమూరు రఘురామ కృష్ణం రాజు పేరును ప్రతిపాదిస్తూ బుధవారం మూడు నామినేషన్ దాఖలయ్యాయి. ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ఉప సభాపతి పదవికి రఘురామ పేరు ఖరారు కావడంతో ఎన్డీఏ కూటమి మూడు పార్టీలకు చెందిన పలువురు మంత్రుల నేతృత్వం లో శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవరకు ఆయన తరపున నామినేషన్ పత్రాలను అందజేశారు. శాసన సభ్యులు కనుమూరు రఘురామ కృష్ణంరాజు పేరుని ప్రతిపాదిస్తూ ఎన్డీఏ కూటమిలోని మూడు పార్టీల తరుపున మూడు నామినేషన్లను దాఖలు చేయడం జరిగింది. తెదేపా తరపున రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి నారా లోకేష్, జనసేన తరపున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ మరియు బీజేపీ తరపున పెన్మత్స విష్ణుకుమార్ రాజు వేరువేరుగా సంతకాలు పెట్టి ఉప సభాపతి పదవికి ఉండి శాసన సభ్యులు కనుమూరు రఘురామ కృష్ణంరాజు పేరును ప్రతిపాదిస్తూ మూడు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఉప సభాపతి పదవికి నేటి ఉదయం జారీచేసిన నోటిఫికేషన్‌లో నేటి ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల్లోపు నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలనే నిబంధల మేరకు సాయంత్రం 4.30 గంటల సమయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నేటి సాయంత్రం 5.00 గంటలకల్లా నామినేషన్లు దాఖలు చేసే గడువు ముగియడంతో, మరెవ్వరూ ఈ పదవికి నామినేషన్ దాఖలు పర్చకపోవడంతో రేపు మధ్యాహ్నం 12.00 గంటలకు ఉప సభాపతి పదవికి కనుమూరు రఘురామ కృష్ణంరాజును ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించే అవకాశం ఉంది.

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెంన్నాయుడు, రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ మరియు గాజువాక శాసన సభ్యులు మరియు టీడీపీ రాష్ట్రాధ్యక్షుదు పల్లా శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాకాణికి 54 ప్రశ్నలు..

**రెండున్నర గంటలపాటు పోలీసుల విచారణ**



ముత్తుకూరు (అమరావతి): మాజీ మంత్రి, వైకాపా నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీసులు నెల్లూరు జిల్లా ముత్తుకూరు పీఎస్‌లో చారించారు. సామాజిక మాధ్యమాల్లో తెదేపా నేత సోమిరెడ్డిపై ఆరోపణలు, కార్టూన్ల ప్రచురణపై తెదేపా నేతల ఫిర్యాదుతో ముత్తుకూరు పీఎస్‌లో కాకాణిపై కేసు నమోదైంది. దీనికి సంబంధించి కృష్ణపట్నం సీఐ రవినాయక్ సమక్షంలో రెండున్నర గంటలపాటు విచారించారు. విచారణలో భాగంగా కాకాణిని పోలీసులు 54 ప్రశ్నలు అడిగారు. పోలీసులు అడిగిన ప్రశ్నల్లో చాలా వాటికి ఆయన సమాధానం ఇవ్వలేదు. అంతకుముందు ఈ కేసు విచారణకు మందీ మార్బలంతో ర్యాలీగా వచ్చిన కాకాణిని పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు అడ్డుపెట్టి ర్యాలీని అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాకాణి ఒక్కరినే స్టేషన్ వద్దకు అనుమతించారు.

# అరెస్టులు ఆగవు

- తప్పుడు ప్రచారం చేస్తే తాటతీస్తాం
- ఎవ్వరినీ వదలి పెట్టే ప్రసక్తి లేదు
- వివేకంతో స్పందించాలని జగన్‌కు సూచన
- సోషల్ మీడియా సైకోలకు హోంమంత్రి హెచ్చరిక

అమరావతి (చైతన్య రథం): సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ వైకాపా నేతలు ఎలాంటి వ్యక్తులకు మద్దతిస్తున్నారో ఆలోచించుకోవాలన్నారు. కొందరి పోస్టులు చూస్తే దారుణంగా ఉన్నాయన్నారు. జడ్జిలు, వారి కుటుంబ సభ్యులను కూడా నోటికి వచ్చినట్టు వాళ్లు పెట్టిన పోస్టులపై కోర్టు కూడా మొట్టికాయలు వేసింది. తిరుపతి జిల్లాలో జరిగిన ఘటనపై తప్పుడు ప్రచారం చేశారు. ఆ తర్వాత పోస్టులు డిలీట్ చేశారని



అయినా, వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కేసులు నమోదు చేస్తామన్నారు. మహిళలను ఏదైనా అంటే రాయలసీమ వాసులు ఊరుకోరు, కానీ సొంత తల్లినీ, చెల్లినీ తిట్టినవారిని జగన్ ఏంచేయలేకపోయారని ఎద్దేవా చేశారు. మీ తల్లినీ, చెల్లినీ తిట్టిన ఉన్మాదులను మేం అరెస్టులు చేస్తున్నాం" అని హోం మంత్రి జగన్‌ను ఉద్దేశించి మంత్రి పేర్కొన్నారు. ఎలాంటి వారికి మీరు మద్దతిస్తున్నారో ఆలోచించుకోవాలన్నారు. కొందరు పోస్టులు చూస్తే దారుణంగా ఉన్నాయని, వాళ్లు పెట్టిన పోస్టులపై కోర్టు కూడా మొట్టికాయలు వేసిందని గుర్తు చేశారు. ఇలాంటి పోస్టులు పెట్టినవారిని ఏం చేయాలో ప్రజలే చెప్పాలన్నారు. గతంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన అనేకమంది టీడీపీ నేతలపై కేసులు పెట్టారని గుర్తు చేశారు. ప్రత్యర్థి పార్టీ వాళ్ళు ఎక్కడికి వెళ్లినా తాము అడ్డుకోవడం లేదన్నారు. సోషల్ మీడియా సైకోలను ఇలాగే వదిలేస్తే రేపు మీ ఇంట్లోని ఆడపిల్లలపైనా పోస్టులు పెడతారని వైసీపీ నేతలను హెచ్చరించారు. - జగన్‌కు ఉన్న పది మంది ఎమ్మెల్యేలు కూడా ఆయనకు సహకరించడం లేదన్నారు. సోషల్ మీడియా పోస్టులపై వైసీపీ నేతలు హెచ్‌ఆర్‌సీకి వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. వర్రా రవీంద్రరెడ్డి, బోరగడ్డ అనిల్, ఇంటూరి రవి.. సమాజంలో తిరగడానికి వీల్లేదని హెచ్చారించారు. ఇలాంటి నీచులను ప్రోత్సహించడం ఎంత ప్రమాదమో ప్రజలు ఆలోచించాలన్నారు. క్షమించరాని పోస్టులు పెట్టిన వారికి మద్దతిస్తున్న వైసీపీ నేతలను ఏమనాలని ప్రశ్నించారు. నేరంలో భాగస్వామ్యం ఉందన్నట్లు వైవీ సుబ్బారెడ్డి చొరవ తీసుకున్నారా? అని నిలదీశారు. రాజకీయ ముసుగు తీసి ప్రజల ముందు నిలబెట్టే ప్రభుత్వం కూటమిదని గుర్తించుకోవాలని హెచ్చరించారు. పుంగనూరు, తిరుపతిలో బాలికల ఆత్మగౌరవం దెబ్బతినేలా ప్రకటనలు చేసిన వారిపై చర్యలు కఠినంగాను ఉంటాయన్నారు. ఆడపిల్లలపై నోటికొచ్చినట్లు మాట్లాడేవారిపై కేసులు పెడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రత్యేక చట్టం తేవడంపైనా తమ ప్రభుత్వం దృష్టి సారించిదని వెల్లడించారు.

చైతన్యరథం

## కేసులు పెడితే తప్పేంటి?

**అసభ్య పోస్టులపై హైకోర్టు వ్యాఖ్య**



అమరావతి (చైతన్య రథం): అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేముందని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. జడ్జిలను కూడా దూషిస్తూ పోస్టులు పెట్టారని వ్యాఖ్యానించింది. పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి ఉత్తర్వులను ఇవ్వలేమంది. కేసులపై అభ్యంతరముంటే నేరుగా కోర్టును ఆశ్రయించాలని చెప్పింది. పిల్ వేయడానికి వీలు లేదని పేర్కొంది. సామాజిక మాధ్యమ కార్యకర్తలపై మూకుమ్మడిగా కేసులు పెడుతున్నారని విజయబాబు హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం ఈమేరకు వ్యాఖ్యలు చేసింది.

## రెండూ అమరావతిలోనే..

**హెచ్చార్సీ, లోకాయుక్తపై హైకోర్టుకు సర్కారు స్పష్టం**

అమరావతి (చైతన్య రథం): హెస్ఆర్సీ, లోకాయుక్త కమిషన్ తరలింపుపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. హెచ్ఆర్సీ, లోకాయుక్త కమిషన్‌ను అమరావతిలోనే ఉంచుతామని, అందుకు వీలుగా చట్టసవరణ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు మూడు నెలలకు వాయిదా వేసింది. హెచ్ఆర్సీ, లోకాయుక్త కమిషన్ తరలింపుపై మద్దిపాటి శైలజ, ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

## అంబటి అతి..
## సోషల్ సైకో అరెస్ట్



గుంటూరు (చైతన్య రథం): మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంట్లో వైకాపా సోషల్ మీడియా సైకోను పోలీసులు అరెస్ట్ చేశారు. హోంమంత్రి అనితపై పల్నాడు జిల్లా నకరికల్లుకు చెందిన కార్యకర్త రాజశేఖర్ రెడ్డి సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టాడు. దీనిపై నూజివీడులో కేసు నమోదు చేసిన పోలీసులు.. రాజశేఖర్ కోసం కొన్ని రోజులుగా గాలిస్తున్నారు. నకరికల్లులో అతడి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం అంబటి రాంబాబు స్పందిస్తూ రాజశేఖర్ తమ ఇంట్లోనే ఉన్నాడని.. సంబంధిత ఆధారాలుంటే అరెస్ట్ చేసుకోవచ్చన్నారు. దీంతో బుధవారం నూజివీడు పోలీసులు.. గుంటూరులో అంబటి ఇంటికి వెళ్లారు. ఫిర్యాదుకు సంబంధించిన ఆధారాలను చూపించి రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి తీసుకెళ్లారు.

## బొత్సకు అచ్చెన్న స్ట్రాంగ్ ఆన్సర్



అమరావతి(చైతన్య రథం): విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా కేసులపై శాసన మండలిలో స్వల్ప వాగ్వాదం జరిగింది. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫల మైందంటూ మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన విమర్శలను మంత్రి అచ్చెన్నాయుడు తిప్పికొట్టారు. ప్రభుత్వం తరపున ఇంకా పర్యవేక్షణ లోపం ఉందని బొత్స ఆరోపించారు. మృతుల విషయంలో స్పష్టత లేదన్నారు. అనంతరం అచ్చెన్నాయుడు స్పందిస్తూ గత ఐదేళ్లలో వాటర్ ట్యాంక్‌లలో పిడికెడు బ్లీచింగ్ కూడా వేసిన సందర్భాలు లేవన్నారు. పంచాయతీలకు పైసా నిధులు కేటాయించక పోగా.. కేంద్రం ఇచ్చిన వాటినీ దారిమళ్లించా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4వేల కోట్లతో పంచాయతీలను బలోపేతం చేసే చర్యలు చేపట్టిం దన్నారు. గుర్ల ప్రాంతానికి ఇన్నాళ్లూ ప్రాతినిధ్యం వహిస్తు న్నందున తనవల్ల కూడా ఇది జరిగిందని ఒప్పుకోవాలని బొత్సకు అచ్చెన్న హితవు పలికారు.

# చేనేత మార్కెటింగ్‌కు 'ఆద్యం'

- నేత ఉత్పత్తుల అమ్మకాలకు బిర్లా గ్రూపు సహకారం
- నేడు ఒప్పందంలోని అంశాలపై చర్చ
- చేనేత విక్రయాలకు పెరగనున్న మార్కెట్
- నేతన్నలకు ఏడాది పొడువునా ఉపాధి
- చేనేత జౌళి మంత్రి ఎస్ సవిత ప్రకటన



అమరావతి (చైతన్య రథం): చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతోపాటు నేతన్నలకు 365 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దీనిలో భాగంగా ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన 'ఆద్యం' హ్యాండ్-వోవెన్ సంస్థతో ఒప్పందం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు రాష్ట్ర చేనేత జౌళి మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ.. రాష్ట్రంలోని చేనేత ఉత్పత్తులు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయన్నారు. వాటిలో ఉప్పాడ జమధాని చీరలు, మంగళగిరి చీరలు, వెంకటగిరి చీరలు, ధర్మవరం సిల్క్ చీరలు, పావడాలు జియోగ్రాఫికల్ ఇండికేషన్ హోదా కలిగి ఉన్నాయన్నారు. ఈ వస్త్రాలకు మరింత ప్రాచుర్యం కల్పించడంతోపాటు మార్కెటింగ్ సౌకర్యం కలిగించడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కార్యాచరణ ప్రారంభించారన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర ఉత్పత్తులైన ఉప్పాడ-కాటన్ జమధాని, పులగుర్త-మల్కా ఖాదీ, అంగర-కాటన్ చీరలు, వెంకటగిరి-కాటన్ చీరలు, కోడుమూరు గద్వాల్ -కాటన్ చీరలకు ఆద్యం హ్యాండ్-వోవెన్ సంస్థతో కలిసి మార్కెటింగ్ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉన్న ఆద్యం సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధి మనీష్ సక్సేనాతో కలిసి ఒప్పందంలోని అంశాలను గురువారం ఖరారు చేయాలని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణిని ఆదేశించినట్టు తెలిపారు. ఆద్యం సంస్థ ఇప్పటికే దేశంలో వారణాసి, పోచంపల్లి, భుజ్ ప్రాంతాలకు చెందిన చేనేత సంఘాలతో పనిచేస్తోందన్నారు. ఏపీకి చెందిన చేనేత వస్త్రాల మార్కెటింగ్‌పై ఆ సంస్థతో ఒప్పందం ఖరారైతే నేతన్నలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. స్వయంగా ఆ సంస్థ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల విక్రయాలకు మార్కెట్ సదుపాయం కలుగుతుందన్నారు. దీనివల్ల చేనేత పురాతన డిజైన్లను ఆద్యం సంస్థ భద్రపరచడంతోపాటు ఏపీ చేనేత కార్మికులకు ఏడాదిపాటున ఉపాధి లభించి, ఆర్థిక భరోసా కలుగుతుందని మంత్రి సవిత ఆశాభావం వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో అన్ని రంగాలతోపాటు చేనేతరంగం కూడా నిర్వీర్యమైందన్నారు. అప్పటి ప్రభుత్వ నుంచి ఏవిధమైన భరోసా లభించకపోవడం, పెట్టుబడులు పెరగడం, వస్త్రాలకు మార్కెట్ సదుపాయం లేకపోవడం, చేసిన అప్పులు తీర్చేమార్గం లేకపోవడం వంటి కారణాలతో ఎందరో చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో మరోసారి సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడంతో, చేనేత పరిశ్రమకు మంచిరోజులు వచ్చాయన్నారు. 2014-19లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అమలుచేసిన అన్ని పథకాలనూ అమలు చేయనున్నామని తెలిపారు. అదే సమయంలో చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపునకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. నేతన్నలు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి మంత్రి ఎస్.సవిత ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# యువతా.. కదలిరండి!



- బంగారు బాటలేస్తోన్న ఎన్డీయే సర్కారు
- యువత అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- చంద్రబాబు సంకల్పం.. క్రీడాంధ్రప్రదేశ్
- ఉపాధి కల్పనకు మంత్రి లోకేష్ కృషి..
- సర్కారు జెట్ స్పీడ్‌ని అందుకోండి..
- యువతకు శాప్ ఛైర్మన్ అనిమిని పిలుపు

అమరావతి (చైతన్య రథం): యువత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

### ఐటీ శాఖకు లోకేష్ పెద్దపీట

'ఐటీ మంత్రి లోకేష్ పదిరోజుల అమెరికా పర్యటనవల్ల రాష్ట్రానికి పెట్టుబడులు పరుగులు పెడుతున్నాయి. 2019-24లో రాష్ట్రంలో యువతకు గ్రహణం పట్టింది. యువగళంలో ఇచ్చిన హామీ మేరకు లోకేష్ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నారు. అతి త్వరలో 16,347 టీచర్లు, 6,100 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయబోతున్నాం' అని అనిమిని వెల్లడించారు. 'దేశంలో ఎక్కడా లేని విధంగా క్రీడాకారులకు ఉద్యోగాలల్లో 3శాతం రిజర్వేషన్ కల్పించిన ఏకైక నాయకుడు చంద్రబాబు. క్రీడారంగ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించింది కూటమి ప్రభుత్వమే. పాఠశాల క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు ముందుగానే పంపిణీ చేసిన ఏకైక విద్యాశాఖ మంత్రి లోకేష్ మాత్రమే. క్రీడాకారులకు అలవెన్స్ 50శాతం ముందే విడుదల చేసిన మంత్రి ఎవరైనా ఉన్నారంటే అది మంత్రి లోకేష్. యువత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్‌కు రాష్ట్ర యువత తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. లోకేష్ అమెరికా పర్యటనతో రాష్ట్రానికి పరి శ్రమలు క్యూకట్టాయి. మన బిడ్డలు ప్రపంచంలో ది బెస్ట్ అనిపించుకునేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారు. క్రీడాకారులకు చంద్రబాబు ప్రకటించిన ప్రోత్సాహకాలు ఎనలేనివి. పారిశ్రామికరంగాన్ని లోకేష్ జెడ్ స్పీడ్‌లో తీసుకెళ్తున్నారు. రాష్ట్ర క్రీడాకారులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. అందుకు కూటమి ప్రభుత్వం అన్ని సదుపాయాలను కల్పిస్తోంది' అని శాప్ ఛైర్మన్ రవినాయుడు స్పష్టం చేశారు.

### యువత క్రీడల్లో రాణించాలి

యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఏ రంగంలోనైనా రాష్ట్రంలో క్రీడాకారులు రాణించేలా కూటమి ప్రభుత్వం యువతను ప్రోత్సహిస్తుంది. నాటి క్రీడాంధ్రప్రదేశ్‌ను వైసీపీ పాలకులు భ్రష్టుపట్టించారు. గత ఐదేళ్లలో క్రీడా నిధులను దోచుకొని క్రీడాకారులకు ద్రోహం చేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. మెడల్స్ సాధించిన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపైన ఉందన్న చంద్రబాబు ఒక్కమాట చాలు, క్రీడా రంగానికి సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ఇస్తోన్న ప్రాధాన్యత అర్థం చేసుకోవడానికి' అని రవినాయుడు వ్యాఖ్యానించారు.

### క్రీడా వికాసమే లక్ష్యం..

ప్రతి నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్రాలను పెట్టి క్రీడకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పోటీ పడేలా తర్ఫీదు ఇచ్చేందుకు మంచి శిక్షకులను గతంలో టీడీపీ ప్రభుత్వం నియమించింది. దాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. 90 శాతం పూర్తి చేసిన క్రీడా వికాస కేంద్రాలను కూడా జగన్‌రెడ్డి పక్కనపెట్టి క్రీడాకారులకు అన్యాయం చేశాడు. చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చి ఉద్యోగాల్లో కూడా వారికి మంచి అవకాశాన్ని కల్పిస్తామని రవినాయుడు అన్నారు.

### నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు ప్రత్యేక చర్యలు

స్కిల్ సెంటర్‌ల ద్వారా శిక్షణనిచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఐటీ మంత్రి లోకేష్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పిల్లలందరూ క్రీడల్లో రాణించాలని, ప్రతి స్కూల్‌కు గ్రౌండ్ ఉండాలని జీవో విడుదల చేసిన ఏకైక విద్యా మంత్రి నారా లోకేష్. స్కూల్ గేమ్స్‌పై ఏ మంత్రీ దృష్టి సారించలేదు. లోకేష్ ఆలోచనలతో రాష్ట్రంలో క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతోంది. అలవెన్స్, ట్రాన్స్‌పోర్టు, ఫుడ్‌లో 50 శాతం అలవెన్సు ఇచ్చింది కూటమి ప్రభుత్వం. డ్రస్ కోడ్ ఇచ్చాం. 13 ఉమ్మడి జిల్లాలకు 13 డ్రెస్ కోడ్లు ఇచ్చి పిల్లలు గ్రౌండ్లల్లో ఆడుతుంటే గ్రౌండ్లు కళకళలాడుతున్నాయి. గత ప్రభుత్వంలో కబడ్డీ ఆడేవారికి వాలీబాల్ కిట్లు, వాలీబాల్ ఆడేవారికి క్రికెట్ కిట్లు ఇచ్చేవారు. కాని కూటమి ప్రభుత్వం వచ్చాక క్రీడాకారులకు పెద్దపీట వేస్తూ క్రీడాకారులకు సరైన వసతులు కల్పిస్తూ.. క్రీడారంగానికి కృషి చేస్తోందని రవినాయుడు వివరించారు.

చైతన్యరథం

# వైసీపీ చెలాగాటం బాధితులకు ప్రాణసంకటం

- టీడీపీ ఏజెంట్‌గా కూర్చున్నందుకు అక్రమ కేసులు
- నాడు వైసీపీ ఎమ్మెల్యే తమ మామిడి చెట్లు నరికించారు
- వైసీపీ మాజీ ఎమ్మెల్యే బంధువు అక్రమాలపై బాధితుడి ఫిర్యాదు
- ఇవ్వాల్సిన డబ్బులు అడిగినందుకు వైసీపీ కార్యకర్త దాడి



మంగళగిరి (చైతన్యరథం) : పలువురు వైసీపీ నేతల బాధితులు బుధవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీలు ఇచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టడమేగాక ఆర్థికంగా నష్టపరిచారంటూ నేతలకు మొరపెట్టుకున్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శ్యావల దేవదత్ అర్జీలు స్వీకరించారు. గత ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్‌గా, మండల క్లస్టర్ ఇంచార్జ్‌గా టీడీపీ తరఫున పనిచేశానని. వైసీపీ రాజంపేటకు చెందిన అప్పటి ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి తనపై కక్ష గట్టి అక్రమ కేసులు పెట్టారని అన్నమయ్య జిల్లా నందలూరు మండలం శివరామపురం గ్రామానికి చెందిన పసుపులేటి దుర్గా ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు చేశాడు. తనకు ఉన్న డికే పట్టా భూమిని రద్దు చేయించాలని చూశాడని, ఆర్థికంగా తనను దెబ్బతీసేందుకు ఇటుకల తయారీ పరిశ్రమను అక్రమంగా సీజ్ చేయించి జరిమానా వేయించాడని వాపోయాడు. తనపై పెట్టిన తప్పుడు కేసులు తొలగించి తన ఫ్యాక్టరీపై వేసిన అక్రమ ఫైన్ లను రద్దు చేయాలని ప్రవీణ్ కుమార్ నేతలకు విజ్ఞప్తి చేశాడు.

గతంలో వీఆర్వోగా లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన కుంజా గంగరాజు అక్రమాలకు చిరునామాగా మారాదని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెంకు చెందిన మందపాటి మోజేష్ నేతలకు ఆరోపించాడు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బంధువు కావడంతో సస్పెన్షన్ పెండింగ్‌లో ఉండగానే బుట్టాయగూడెం ఎమ్మార్వో ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ గా పోస్టింగ్ తీసుకున్నాడని ఫిర్యాదు చేశాడు. అతని అక్రమాలకు అడ్డులేదని గత వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌లో తన బాబాయికి అన్యాయం జరగ్గా ఎమ్మార్వోను అడి గేందుకు వెళితే తనపై అక్రమ కేసులు పెట్టించి వేధించాడని వాపోయాడు. కుంజా గంగారాజు అక్రమాలపై ఎంక్వైరీ చేయించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరాడు. సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం పెమనకుంటపల్లి తాండాకు చెందిన రమావత్ బొజ్జే నాయక్ గ్రీవెన్స్‌లో నేతలకు విజ్ఞప్తి చేస్తూ.. తాత ముత్తాతల నుండి తమ స్వాధీనంలో ఉండి సాగు చేసుకుంటున్న భూమిలో అప్పటి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి అక్రమంగా మామిడి చెట్లను నరికించి మార్కెట్ యార్డ్ కోసం అంటూ భూమిని తీసుకుని ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అవసరం లేకపోయినా తాము టీడీపీకి అనుకూలంగా ఉన్నామన్న నెపంతో కావాలనే మామిడి చెట్లను నరికించి తమకు నష్టం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వమని అడిగినందుకు వైసీపీకి చెందిన షేక్ అహ్మద్ జానీ అర్ధరాత్రి తన ఇంటిపై దాడికి వచ్చి దారుణంగా తిడుతూ, చంపేస్తామని బెదిరించాడని అతనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని గుంటూరు కొండయ్య కాలనీకి చెందిన కె. రవికుమార్ నేతలను కోరాడు.

2019 ఫిబ్రవరిలో శివకోటి, చింతపల్లి గ్రామాల్లో పంచాయతీ రాజ్ డిపార్ట్ మెంట్‌కు చెందిన రూ. 80 లక్షల రూపాయల పనులు జియోట్యాగింగ్ పూర్తి చేసి పనులు పూర్తి చేశామని తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం తాము టీడీపీ వారమని.. డిపార్ట్ మెంట్ అధికారులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చి తమకు రావాల్సిన బిల్లులు రాకుండా అడ్డుకున్నారని కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటి గ్రామానికి చెందిన చాగంటి స్వామి వాపోయారు. బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. విజయవాడలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు విజ్ఞప్తి చేస్తూ.. తమకు రావాల్సిన ఫీజ్ రియంబర్స్‌మెంట్ బకాయిలను గత ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కాలేజీ తమపై ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తోందని.. ఫీజ్ రియంబర్స్ మెంట్ వెంటనే పడేలా చూడాలని వేడుకున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన కొమ్మినేని రమణరావు ఇచ్చిన వినతి పత్రంలో తాను ఒంగోలు డైరీలో పనిచేసి రిటైర్ అయ్యానని తనకు రావాల్సిన జీతం రూ. 3,70,000లు ఆగిపోయిందని అది వచ్చేలా చూడాలని నేతలను వేడుకున్నాడు. కర్నూలు జిల్లా ఆదోని మండలం కణేకల్లు గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం 1 శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉందని వర్షం పడితే పెచ్చులూడుతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియ స్థానిక ఆసుపత్రిలో పిల్లలకు చదువు చెప్తున్నారని దీంతో అక్కడి రోగులకు ఇబ్బందిగా ఉంటుందని కొత్త అంగన్వాడీ భవనం మంజూరు చేసి పిల్లల సమస్యలను పరిష్కరిచాలని గ్రామానికి చెందిన రంగస్వామి వేడుకున్నారు.

















చైతన్యరథం



భారతదేశంలోని బ్రిటీష్ హైకమిషనర్ లిండే కెమెరాన్ బుధవారం సచివాలయంలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసినప్పటి చిత్రం



ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ బుధవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. రవిశంకర్‌ను సాదరంగా స్వాగతించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆయనతో కొద్దిసేపు ముచ్చటించిన అనంతరం గౌరవ సత్కారం అందించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాద పూర్వకంగా బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి. చిత్రంలో పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య



## గవర్నర్‌ను కలిసిన మంత్రి ఫరూక్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.






# డ్రోన్ల సాయంతో గంజాయి సాగుకు చరమగీతం

### - సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన యంత్రాంగం

అమరావతి (చైతన్యరథం) : రాష్ట్రంలో గంజాయి సాగుకు చరమగీతం పాడేందుకు రంగం సిద్ధమయింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో సర్కారు అప్రమత్తమయింది. డ్రోన్లతో గంజాయి సాగును అరికట్టేందుకు కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే అధికారులు అనకాపల్లి జిల పరిధిలోని 3.55 ఎకరాల్లో సాగవుతున్న గంజాయి సాగును డ్రోన్ల సాయంతో కనిపెట్టి ధ్వంసం చేశారు. ఇలా ఉండగా మూడు అడుగులు ఎత్తు పెరిగిన గంజాయి మొక్కలను సైతం కనుగొనేలా మల్టీ స్పెక్ట్రల్ కెమేరాలను డ్రోన్లతో అనుసంధానించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గంజాయి మొక్కలను గుర్తించేందుకు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), గూగుల్ సాయం తీసుకొని శాటిలైట్‌తో హాట్ స్పాట్‌ల ద్వారాగంజాయి సాగును పసిగట్టడంలో నిమగ్నమయింది. గంజాయి సాగును సమూలంగా ధ్వంసం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.



# సీఎం సహాయ నిధి పేదలకు వరం

### - గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం చైతన్యరథం: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు , శాసన సభ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం గన్నవరం నియోజకర్గంలో వివిధ ఆరోగ్య కారణాలతో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్న 12మంది.. గన్నవరానికి చెందిన సురేష్ బాబుకు రూ.3,50,071 మంజూరు చేసిన పత్రాలను, తేలప్రోలు గ్రామానికి చెందిన పంచకర్ల వినోద్ కు రూ.1,45,000 , బాబులపాడు కు చెందిన వేపూరి దేవిడ్‌కు రూ.60,000, విడమానూరుకు చెందిన వేములపల్లి రమేష్ కు రూ.88,884, అత్కూరు గ్రామానికి చెందిన మస్తాన్ వలికి రూ.1,13,265, పెద్ద అవుటుపల్లికి చెందిన వెలమాటి నరేంద్రకు రూ.11,500, గన్నవరంకు చెందిన జలసూత్రం వెంకాయమ్మకు రూ.30,786, బుధవారం గ్రామానికి చెందిన వేల్పూరి రాజుకు రూ.75,000, విడమానూరు గ్రామానికి చెందిన గొప్పల రాజశేఖర్‌కు రూ.1,43,502, మడిచర్లకు చెందిన బల్లమూడి అరుణ కుమారికి రూ.2,05,884 , పెద్దవటిపల్లి గ్రామానికి చెందిన చిలకపాటి శారదమ్మకు రూ.55,800, మల్లవల్లి గ్రామానికి చెందిన షేక్ ప్యారి 25,166 కుటుంబ



సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు . ఆపదలో ఉన్న ఎన్నో కుటుంబాలను సీఎం సహాయ నిధి ఆపద్భందువుగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు. మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నారని అన్నారు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఆర్జీవీ ఇంటికి పోలీసులు



హైదరాబాద్ (చైతన్య రథం): వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ)కు ఏపీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు.. జూబ్లీహిల్స్‌లోని ఆర్జీవీ ఇంటికి వచ్చి అందజేశారు. ఎస్సై శివరామయ్య ఆధ్వర్యంలోని బృందం నోటీసులు ఇచ్చింది. ఎన్నికలకు ముందు 'వ్యూహం' సినిమా ప్రమోషన్ సమయంలో.. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులతోపాటు.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా వర్మ ఎక్స్ పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు స్టేషన్లో కేసు నమోదైంది. మద్దిపాడు మండల తెదేపా కార్యదర్శి ఎం రామలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు విచారణకు హాజరు కావాలంటూ ఆయనకు నోటీసులు అందజేశారు.

మరోవైపు తుళ్లూరులోనూ ఆర్జీవీపై కేసు నమోదైంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ఫొటోలను రామ్‌గోపాల్ వర్మ గతంలో మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెట్టారని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు తుళ్లూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయనపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలావుంటే, అసభ్య పోస్టుల వ్యవహారంలో ఇప్పటికే అరెస్టయిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రరెడ్డి ఇచ్చిన వాంగ్మూలం మేరకు రాఘవరెడ్డి కోసం పులివెందుల, లింగాల మండలాల్లో గాలిస్తున్నారు. అవినాష్ పీఏ స్వగ్రామం అంబకపల్లెలో పోలీసులు నిఘా పెట్టారు. మరోవైపు పులివెందులలో నమోదైన అట్రాసిటీ కేసులో అనుమానితుల కోసం గాలింపు కొనసాగుతోంది.

## చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే గళ్లా మాధవి చేయూత



గుంటూరు పశ్చిమ (చైతన్యరథం): నియోజకవర్గ ఎమ్మెల్యేగళ్ళా మాధవి చొరవతో చిన్నారి వైద్యానికి రూ. 10లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు అయ్యాయి. గుంటూరు 44వ డివిజన్‌కు చెందిన వైరాలా నవీన్ (7) తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారు. వీరిది చాలా పేదకుటుంబం చిన్నారి వైద్యానికి ఆర్థిక కష్టాలు ఎదురు అవ్వటంతో తమ కుమారుడిని ఆదుకోవలసినదిగా తండ్రి వైరాలా కోటేశ్వరరావు ఎమ్మెల్యే గళ్ళా మాధవిని అభ్యర్థించగా, వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.10 లక్షలు మంజూరు చేయించి, బుధవారం చిన్నారి తండ్రి వైరాలా కోటేశ్వరరావుకు యల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిటవరంగా మారిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల పట్ల చాలా మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ఉంటారని, దీని వలన పేదలకు లక్షలలో ఆర్థిక సహాయాలు అందుతున్నాయన్నారు. పేదలు వైద్యము పొందటానికి అవసరమయ్యే ఆర్థిక సహయము అందించటం కోసం తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే గళ్లా మాధవి హామినిచ్చారు. అడిగిన వెంటనే తమ చిన్నారినికి ఆర్థిక సహాయం అందించిన గళ్లా మాధవికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తమ కుటుంబం ఎల్లప్పుడు రుణపడి ఉంటామన్నారు.

**హైకోర్ట్ వ్యాఖ్యలు వైసీపీ నేతలకు చెంపపెట్టు : మాధవి**

సోషల్ మీడియాను వేదికగా చేసుకొని "అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేముందని" ఏపీ హై కోర్ట్ వ్యాఖ్యానించటం వైసీపీ నేతలకు చెంపపెట్టులాంటిదని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.... అధికారంలో ఉన్నాం కదా అని వైసీపీ నేతలు ఇష్టానుసారంగా రెచ్చిపోయి మహిళల మీద సభ్యసమాజం తలదించుకొనే విధంగా పోస్టులు పెట్టారని, ఇప్పుడు అధికారము పోయిన కూడా ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళా మంత్రులు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కుటుంబ సభ్యులపై నీచంగా, మార్ఫింగ్ చేస్తూ పోస్టు పెడితే వారిని చట్టప్రకారం అరెస్టు చేసిందన్నారు. సొంత చెల్లెలు షర్మిల, సునీతల మీద కూడా అత్యంత హేయంగా పోస్టులు పెట్టారని షర్మిల మీడియా సాక్షిగా రోదించారని ఈ వైసీపీ ఉన్మాదులు సమాజానికి సంఘ విద్రోహులుగా తయారయ్యారన్నారు. ఇటువంటి ఉన్మాదుల ఆటలు కట్టిస్తామని, మహిళల గౌరవానికి, వారి భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు.

## సాంకేతికతతో సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం

◆టీడీపీ నేత మన్నవ మోహనకృష్ణ స్పష్టీకరణ

◆ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు





గుంటూరు (చైతన్యరథం): ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌కి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి మోహనకృష్ణ... ఉండవల్లి నివాసంలో చంద్రబాబును, లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని టెక్నాలజీని ఉపయోగించి ప్రజాసేవ చేస్తానని వెల్లడించారు. అనంతరం మన్నవ మోహనకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... సాంకేతిక యుగంలో రోజురోజుకు విస్తృత రీతిలో మారుతున్న టెక్నాలజీని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని వెల్లడించారు. నూతన సాంకేతికతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, ఈ తరుణంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నాకు ఈ బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు పేరు చెప్పగానే తెలుగు రాష్ట్రాల్లోనే కాదు... దేశ వ్యాప్తంగా ప్రజలు టెక్నాలజీ ముఖ్యమంత్రి దార్శనికతను అరగుదుల నిదర్శమని చెబుతుంటారని, నూతన టెక్నాలజీని అందిపుచ్చుకొని దానిని పాలనకు అన్వయించి అభివృద్ధిని పరుగులు పెట్టించడంలో ఆయన దిట్ట అని వ్యాఖ్యానించారు. మరోవైపు యువనేత నారా లోకేష్ సైతం ఎప్పటికప్పుడు టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి కృషి చేస్తున్నారని, ఐటీ శాఖ మంత్రిగా ఉన్న ఆయన రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల కోసం మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని, రానున్న 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్‌గా లోకేష్ ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నారని, ఆయన కృషితో రాష్ట్రంలో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సిద్ధమైందన్నారు. ఇప్పటికే ఏపీలో సౌర, పవన విద్యుత్ రంగంలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు టాటా పవర్ ముందుకు రావడానికి కూడా లోకేష్ చూపించిన చొరవే కారణమన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ కోసం ఎటువంటి హడావుడి లేకుండా లోకేష్ జరుపుతున్న చర్చలపై దేశవ్యాప్తంగా పరిశ్రమ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయని, స్టీల్ దిగ్గజం ఆదిత్య మిట్టల్‌తో ఒక్క వీడియో కాన్ఫరెన్స్‌తో రూ.1.4 లక్షల కోట్ల పెట్టుబడిని ఖరారు చేయడం అభినందనీయమని మోహనకృష్ణ కొనియాడారు. రాజకీయాల్లో అడుగుపెట్టినప్పటి నుంచి అధికారంతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ నేటి యువతకు రోల్ మోడల్‌గా నిలుస్తూ.... సమస్య ఎంత పెద్దదైనా, ఎంత జటిలమైనదైనా తన దృష్టికి వచ్చిన వెనువెంటనే స్పందించడం, పరిష్కారమయ్యే వరకు వెంటపడడటం... ప్రజాసేవలో మంత్రి లోకేష్ నిబద్ధత, చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. ప్రజా సేవకు టెక్నాలజీని ఉపయోగిస్తామని, సుపరిపాలన అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని మోహనకృష్ణ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



## అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా

### హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బి.కె పార్థసారథి

పెనుకొండ (చైతన్యరథం): అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిస్తానని హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బి.కె పార్థసారథి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా నక్కలగుట్ట కాలనీ వాసులు హిందూపురం రోడ్డు నుండి అక్కమ్మ కొండ వరకు సిమెంట్ రోడ్డు వేయాలని, మసీదుకు కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం వినతిపత్రాలు అందజేశారు. అనంతరం బి.కె పార్థసారథి మాట్లాడుతూ... అభివృద్ధి అంటే చెప్పడం కాదు, చేతల్లో చేసి చూపిస్తామన్నారు. హిందూపురం రోడ్డు నుండి అక్కమ్మ కొండపై వరకు రోడ్డు నిర్మాణంతో పాటు... రోడ్డుకు 10 లక్షలు నిధులు మంజూరు, ఉప్పర సగర కళ్యాణ మండపానికి రూ.80 లక్షలు, నక్కలగుట్టలోని మసీదు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి బి.కె పార్థసారథి హామీ ఇచ్చారు. ఎన్నికల హామీలలో ఇచ్చిన మాట ఖచ్చితంగా నిలబెట్టుకుంటామని, బోయ, బలిజ, వడ్డెర్లు, ముస్లీం మైనారిటీలు ఇలా ప్రతి కులస్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో ఉప్పర సగర కళ్యాణ మండపంకు భూమి పూజ చేస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

◆ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టీకరణ

◆గన్ని వీరాంజనేయులుతో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం



భీమడోలు (చైతన్యరథం): కార్యకర్తల సంక్షేమం తెలుగుదేశంపార్టీతోనే సాధ్యపడుతుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. భీమడోలు మండలం ఆగదాలలంకలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అగదాలలంక ప్రధాన కూడలిలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంపీ మహేష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నారని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ద్వారా అనేక ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని ఎంపీ మహేష్ కుమార్ పేర్కొన్నారు. రూ. 100 సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని తెలుగుదేశం పార్టీ కల్పిస్తుందని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. బీమా సదుపాయంతో పాటు విద్య, వైద్యం వంటి సదుపాయాలు పార్టీ కల్పిస్తుందని ఎంపీ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తల బలం అని, సార్వత్రిక ఎన్నికల్లో ప్రాణాలు అడ్డుపెట్టి మరి కార్యకర్తలు పార్టీని గెలిపించారని ఎంపీ మహేష్ కుమార్ కొనియాడారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అధినేత చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఏలూరు పార్లమెంటు పరిధిలో అత్యధిక సభ్యత్వాలు పూర్తి చేయాలని ఎంపీ మహేష్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి

### రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి ఫిర్యాదు

రాజమహేంద్రవరం (చైతన్యరథం): వైసీపీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ వారి కుటుంబ సభ్యులపై దుర్భాషలాడిన శ్రీ రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి డిమాండ్ చేశారు. స్థానిక బొమ్మూరు పోలీస్ స్టేషన్ నందు మహిళలతో కలిసి ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా వేదికగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ వారి కుటుంబాలపై అనుచిత వ్యాఖ్యలు చేసి మహిళా లోకం సిగ్గుపడేలా మాట్లాడిన శ్రీరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ అధికార ప్రతినిధి పిల్లా తనూజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ఎన్డీఏ సర్కార్ లక్ష్యం

◆ప్రధాని మోదీ స్పష్టీకరణ

◆దర్భంగా ఎయిమ్స్‌కు పీఎం శంకుస్థాపన



పాట్నా: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం బీహార్‌లోని దర్భంగాలో ఎయిమ్స్ వైద్యశాలకు శంకుస్థాపన చేశారు. సుమారు 12 వేల కోట్ల ఖరీదైన ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ప్రజల సంక్షేమానికి ఎన్డీఏ సర్కారు కట్టుబడి ఉన్నట్లు ఆయన చెప్పారు. దర్భంగా ఎయిమ్స్ వల్ల స్థానిక ప్రజల ఆరోగ్య విషయాల్లో పెను మార్పు రానున్నట్లు ఆయన వెల్లడించారు. పొరుగు దేశమైన నేపాల్ నుంచి కూడా వైద్య చికిత్సకు జనం రానున్నట్లు ఆయన తెలిపారు.

బీహార్‌లో ఎంతో అభివృద్ధి జరుగుతోందని ప్రధాని అన్నారు. గత ప్రభుత్వాలు బీహార్ ప్రజలు ఆరోగ్యం గురించి ఆలోచించలేదని, ఆరోగ్య మౌలికసదుపాయాల్ని కల్పించలేకపోయినట్లు చెప్పారు. గతంలో ప్రభుత్వాలు తప్పుడు వాగ్దానాలు చేశాయని, కానీ నితీశ్ కుమార్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితి మెరుగైందన్నారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారి కోసం దేశవ్యాప్తంగా 1.5 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ తెలిపారు. తమ ప్రభుత్వం దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను కల్పించిందని, మరో 75వేల మెడికల్ సీట్లను సృష్టించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. నితీశ్ కుమార్ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, రాష్ట్రంలో ఉన్న జంగిల్ రాజ్‌ను తొలగించినట్లు ఆయన తెలిపారు. వరద సమస్యలను దూరం చేసేందుకు బీహార్‌లో ఎన్డీఏ సర్కారు సుమారు 11 వేల కోట్ల ప్రాజెక్టులను అమలు చేస్తోందని ప్రధాని తెలిపారు.

### మళ్లీ మోదీ పాదాలకు మొక్కిన నితీష్

దర్భంగా: లోక్‌సభ ఎన్నికలకు ముందు తిరిగి ఎన్డీయేలోకి వచ్చిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల బహిరంగ వేదికలపై కూడా తిరుగులేని మద్దతు చాటుకుంటున్నారు. దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలోనూ నితీష్ ఇదే తరహాలో విధేయత చాటుకున్నారు. మోదీ పాదాలకు నితీష్ మొక్కే ప్రయత్నం చేశారు. అయితే వెంటనే మోదీ ఆయనను వారించారు.

ప్రధానమంత్రి కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించడం, జాతికి అంకితం చేసేందుకు బీహార్ వచ్చారు. దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లలో 18 జన్ ఔషధి కేంద్రాలను కూడా జాతికి ప్రధాని అంకితం చేశారు. ఈ సందర్భంగా దర్భంగాలో ఏర్పాటు చేసిన ర్యాలీలో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించడంలో నితీష్ చేసిన కృషిని మోదీ ప్రశంసించారు. సుపరిపాలన అంటే ఏమిటో నితీష్ చూపించారని, జంగిల్ రాజ్‌గా ఉండే బీహార్‌ను ఇంత ఉన్నత స్థితికి తీసుకువెళ్లిన నితీష్‌ను ఎంత అభినందించినా తక్కువేనని అన్నారు. అనంతరం నితీష్ ప్రసంగిస్తూ, రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఇస్తున్న మద్దతుకు గాను ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రసంగం ముగియగానే ఆయన నేరుగా ప్రధాని కూర్చున్న చోటుకు వెళ్లి ఆయన పాదాలకు నమస్కరించే ప్రయత్నం చేయడంతో మోదీ వారించారు.

# సీఎం ఏక్‌నాథ్ షిండే బ్యాగ్‌ను తనిఖీ చేసిన ఈసీ



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ రాష్ట్రంలో నేతల బ్యాగులు తనిఖీ చేయడం ఆసక్తికరంగా మారింది. రెండు రోజుల క్రితం శివసేన (యూబీటీ) చీఫ్, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే బ్యాగ్‌ను అధికారులు తనిఖీ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా బ్యాగులను కూడా తనిఖీ చేశారా..? అంటూ ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే బ్యాగులను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు.

ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం ఏక్‌నాథ్ షిండే బ్యాగును అధికారులు పాల్ఘర్ పోలీస్ గ్రౌండ్ హెలిప్యాడ్ వద్ద తనిఖీ చేశారు. హెలికాప్టర్ ల్యాండ్ కాగానే అక్కడికి వెళ్లిన అధికారులు నిబంధనల ప్రకారం.. సీఎం వెంట తెచ్చుకున్న సూట్‌కేస్, ఇతర బ్యాగ్‌లను తనిఖీ చేశారు. అదే విధంగా కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే బ్యాగును కూడా అధికారులు తనిఖీ చేశారు. హెలికాప్టర్‌లో పూణెకి వచ్చిన కేంద్ర మంత్రి లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

కాగా, రెండు రోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు యావత్మాల్‌కు వెళ్లగా అధికారులు తన బ్యాగ్ తనిఖీ చేశారంటూ శివసేన (యూటీబీ) చీఫ్, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీ, అమిత్‌షా బ్యాగులను కూడా తనిఖీ చేశారా..? అంటూ ప్రశ్నించారు. 'నా బ్యాగులు చూసే ముందు మీరు ఏ రాజకీయ నేతల బ్యాగులను తనిఖీ చేశారు? ఏక్‌నాథ్ షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్, మోదీ, అమిత్ షా బ్యాగ్‌లను మీరు తనిఖీ చేశారా? మోదీ బ్యాగ్‌లను తనిఖీ చేసిన వీడియోను నాకు చూపించండి. నేను దీనిని వీడియో తీస్తున్నా' అని అన్నారు.

ఠాక్రే వ్యాఖ్యలపై బీజేపీ తాజాగా స్పందించింది. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బ్యాగ్‌ను కూడా చెక్ చేసినట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు ఠాక్రేకు కౌంటర్ ఇస్తూ ఓ వీడియోను కూడా విడుదల చేసింది. మరోవైపు ఠాక్రే విమర్శలపై కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ స్పందించిన విషయం తెలిసిందే. దేశంలోని అగ్ర రాజకీయ నేతలకు సంబంధించిన హెలికాప్టర్లలో కూడా సోదాలు చేస్తామని తెలిపారు. నిబంధనల ప్రకారమే ఠాక్రే బ్యాగ్‌ను పరిశీలించామన్నారు.



# జార్ఖండ్‌లో ముగిసిన తొలి విడత పోలింగ్

రాంచీ: జార్ఖండ్‌లో బుధవారం జరిగిన తొలి విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ సమయం ముగిసేటప్పటికీ 64.86 శాతం పోలింగ్ నమోదైంది. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. అయితే ఈ గణాంకాలు సుమారు అంచనాలు మాత్రమేనని, కచ్చితమైన ఫలితాలు రావడానికి కొంత సమయం పడుతుందని తెలిపింది. పోలింగ్ ముగిసే సమయానికి క్యూ లైన్‌లలో ఉన్న వారికి అధికారులు ఓటే వేసే అవకాశం కల్పించారు. దాంతో పలు పోలింగ్ బూత్‌లలో ఇంకా ఓటింగ్ కొనసాగుతోంది. దాంతో వివిధ పోలింగ్ బూత్‌లలో నమోదయ్యే ఓటింగ్ శాతం మారే అవకాశం ఉంది. కాబట్టి రాష్ట్ర వ్యాప్తంగా ఓటింగ్ కూడా 1 నుంచి 2 శాతం పెరిగే అవకాశం ఉంది.

కాగా జార్ఖండ్‌లోని మొత్తం 81 స్థానాలకు రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. తొలి విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ బుధవారం ముగిసింది. రెండో విడత పోలింగ్ ఈనెల 20న జరగనుంది. ఈ నెల 23న ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

# బుల్డోజర్ న్యాయంపై సుప్రీంకోర్టు సీరియస్



న్యూఢిల్లీ: నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ఇల్లును కూల్చివేసినా అది రాజ్యాంగానికి విరుద్ధమని సుప్రీం కోర్టు పేర్కొంది. బుల్డోజర్ న్యాయం మీద బుధవారం తీర్పు వెలువరించింది. ఇలాంటి సందర్భాల్లో వ్యవహరించాల్సిన విషయమై దేశం మొత్తానికి వర్తించే విధంగా సంచలన తీర్పు ఇచ్చింది. నేరాలకు పాల్పడిన వారిపై బుల్డోజర్ చర్యలు చేపట్టడంపై సుప్రీం సీరియస్ అయింది. బుల్డోజర్ చర్యలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల మీద జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. ఇళ్లను కూల్చడం సరికాదని.. ఇది నివసించే హక్కును కాలరాసినట్లు అవుతుందని అభిప్రాయపడింది. నిష్పాక్షిక విచారణ పూర్తికాకుండానే నిందితుడిని దోషిగా పరిగణించలేమని పేర్కొంది. అలాంటి వ్యక్తుల ఇళ్లను కూల్చడం అధికార దుర్వినియోగం, చట్ట విరుద్ధమని స్పష్టం చేసింది.

ఒకవేళ దోషిగా నిర్ధారించినా చట్ట ప్రకారం శిక్ష ఉంటుంది తప్ప బుల్డోజర్‌తో న్యాయం చేయలేమని సుప్రీం కోర్టు చెప్పుకొచ్చింది. చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించి నిందితుడు లేదా దోషి ఇంటిని కూల్చేస్తే.. ఆ కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాల్సిందేనని సర్వోన్నత ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. న్యాయవ్యవస్థ స్థానాన్ని పాలనావ్యవస్థ ఎప్పటికీ భర్తీ చేయలేదని సుప్రీం వ్యాఖ్యానించింది. కోర్టుల పాత్రను అధికారులు పోషించడం సరికాదని ఫైర్ అయింది. దోషులను నిర్ధారించడం కోర్టుల పని అని.. కార్యనిర్వాహక అధికారులది కాదని స్పష్టం చేసింది.

నోటీసులు ఇవ్వకుండా కూల్చడం ఏమిటని సుప్రీం కోర్టు సీరియస్ అయింది. ఇక మీదట ఇలాంటివి కుదరదని తేల్చి చెప్పింది. కూల్చివేతలకు, మతానికి సంబంధం పెట్టడం కరెక్ట్ కాదని వ్యాఖ్యానించింది. ఇది ఏ ఒక్క రాష్ట్రానికో కాదని.. ఈ ఆదేశాలు మొత్తం దేశానికి సంబంధించినవి అని కోర్టు పేర్కొంది. క్రిమినల్ కేసులో నిందితుడు అనే కారణంతో ఎవరి ఇంటినైనా కూల్చేస్తామంటే కుదరదని.. అలాంటి పరిస్థితుల్లో అధికారులు చట్టాన్ని విస్మరించరాదని స్పష్టం చేసింది. ప్రతి కుటుంబానికి ఇల్లు ఉండాలనేది ఒక కల అని తెలిపింది.

## కశ్మీర్ లోయను వణికించిన భారీ భూకంపం

◆ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన జనం

శ్రీనగర్: కాశ్మీర్ లోయలో భారీ భూకంపం సంభవించింది. బుధవారం ఉదయం 10:43 ప్రాంతంలో భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 5.2గా నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. భూకంపం తీవ్రత 5.1గా ఉంది. అయితే, పాకిస్తాన్ వాతావరణ విభాగం దానిని 5.3 తీవ్రతగా నివేదించింది. భూకంపం కేంద్రం ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ పర్వత ప్రాంతంలో గుర్తించినట్లు ఇస్లామాబాద్‌లోని నేషనల్ సీస్మిక్ మానిటరింగ్ సెంటర్ తెలిపింది. భూమికి 220 కిలోమీటర్ల లోతులో ఇది కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపింది.

ఈ భూకంపం ధాటికి లోయలోని పలుచోట్ల ప్రకంపనలు వచ్చాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.




# శబరిమల భక్తులకు ఏఐ చాట్‌బాట్

◆లోగో ఆవిష్కరించిన సీఎం విజయన్

తిరువనంతపురం: అయ్యప్ప స్వామి కొలువైన కేరళలోని శబరిమలను సందర్శించే భక్తుల కోసం ఏఐ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తెచ్చారు. శబరిమల యాత్రను మరింత సౌకర్యవంతం చేసేందుకు 'స్వామి చాట్‌బాట్'ను రూపొందించారు. పతనంతిట్ట జిల్లా యంత్రాంగం అభివృద్ధి చేసిన ఈ చాట్‌బాట్ లోగోను బుధవారం సీఎం పినరయి విజయన్ ఆవిష్కరించారు. 'శబరిమల తీర్థయాత్ర అనుభవాన్ని మెరుగుపరచడానికి పతనంతిట్ట జిల్లా యంత్రాంగం అభివృద్ధి చేసిన స్మార్ట్ ఏఐ సాధనం 'స్వామి' చాట్‌బాట్ లోగో ఆవిష్కరించడం గౌరవంగా ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

కాగా, ఆరు భాషలైన మలయాళం, ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం, కన్నడలో శబరిమల గురించి సమగ్ర సమాచారాన్ని 'స్వామి చాట్‌బాట్' అందిస్తుంది. శబరిమలలో పూజా సమయాలతోపాటు రైల్వే, విమాన సౌకర్యాలను తెలియజేస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లో కూడా ఈ చాట్‌బాట్‌ను వినియోగించుకోవచ్చు. శబరిమలలో నవంబర్ 15న 'మండల పూజా మహోత్సవం' ప్రారంభమవుతుంది. ఈనేపథ్యంలో 'స్వామి చాట్‌బాట్'ను అందుబాటులోకి తెచ్చారు.